క్లుప్తంగా

సీసీరోడ్డు పనులు షురూ



పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్: మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో సీసీరోడ్డు పనులకు ఆదివారం మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ పూజలు చేశారు. సీసీరోడ్డుతో పాటు మురికి కాల్వ నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సరిత, నాయకులు భిక్షపతి, ఆంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బోనాలు



హరిచంద్‌తండాలో బోనాలతో గిరిజనులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని హరిచంద్‌తండాలో జగదాంబ దేవి, సేవాలాల్ మహారాజ్ ఆలయం ప్రథమ వార్షిక ఉత్సవాలను తండావాసులు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం ఆలయ అర్చకులు బిక్యానాయక్ ఆధ్వర్యంలో దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తండాలోని మహిళలు గిరిజన సాంప్రదాయ దుస్తుల్లో భక్తి శ్రద్ధలతో అమ్మవారికి బోనాలు తీసి, మొక్కులు తీర్చుకున్నారు.

పరిమళించిన మానవత్వం



పోగొట్టుకున్న పర్సును అందిస్తున్న గోపాల్

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రం చిలప్‌చెడ్ గ్రామం నుంచి ప్రతీ నిత్యం పాలను అమ్మేందుకు కుమ్మరి గోపాల్ జోగిపేటకు వెళ్లి వస్తాడు. ఆదివారం పాల అమ్మడానికి జోగిపేటకు వచ్చిన అతనికి ఓ పర్సు దొరికింది. ఆ పర్సులో ఓ గోల్డ్ రింగ్‌తో పాటు వెయ్యి రూపాయల నగదు, తదితర కార్డులు ఉన్నాయి. దీంతో అతను మానవత్వంతో ఆలోచించి, పర్సులో ఆధార్ కార్డు సహాయంతో బాధితుడి అడ్రస్, ఫోన్ నంబర్ తెలుసుకున్నాడు. బాధితుడు అందోల్ మండలానికి చెందిన లక్ష్మీనారాయణ అని తెలియడంతో అతడికి ఫోన్ చేసి, జోగిపేటకు రప్పించి పోగొట్టుకున్న పర్సు, అందజేసి మానవత్వం చాటుకున్నాడు.

మురుగునీటితో ఇబ్బందులు



పొలంలోకి వస్తున్న మురుగు నీరు

శివ్వంపేట(నర్సాపూర్): మురుగు నీరు పొలంలోకి వస్తుండడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని గూడూర్ గ్రామానికి సంబంధించి మురుగు నీటి కాల్వ పూర్తిస్థాయిలో లేకపోవడంతో వ్యవసాయ పొలంలోకి వస్తుండడం వల్ల పంటలు సాగు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నామని రైతులు భూమేశ్, వెంకటేశ్, మధు వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి, మురికినీరు పొలాల్లోకి రాకుండా కాల్వ నిర్మించాలని రైతులు కోరారు.

అక్రమంగా మట్టి తరలింపు

నర్సాపూర్: మండలంలోని మాడాపూర్ సమీపంలోని అసైన్డ్, ప్రభుత్వ భూములు, అటవి భూముల నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. గుట్టపై ఉన్న చెట్లను కూల్చివేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గుట్టను తవ్వి మట్టిని టిప్పర్లలో నింపి సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని మంగాపూర్ సమీపంలో ఏర్పాటు చేసిన ప్రైవేట్ వెంచర్‌కు తరలిస్తున్నారని వారు తెలిపారు. ఈ విషయమై అటవి శాఖ సెక్షన్ అధికారి బాలేశ్‌ను వివరణ కోరగా.. తమ భూములు కావని చెప్పారు.

మిషన్ భగీరథ నల్లాలపై సర్వే

నిజాంపేట(మెదక్): మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామంలోని ప్రతీ ఇంటిలోని మిషన్ భగీరథ నల్లా కనెక్షన్‌పై ఇంటింటి సర్వేను గ్రామ కార్యదర్శులు నిర్వహిస్తున్నారు. ఆదివారం నందిగామ పరిధిలోని ప్రతీ ఇంటిలో ఉన్న భగీరథ నల్లా కనెక్షన్‌కు ఆధార్‌ను కా ర్డు నంబర్, మొబైల్ నంబర్‌ను లింక్ చేస్తున్నట్లు గ్రామ కార్యదర్శి మొహమ్మద్ ఆరిఫ్ హుస్సేన్ తెలిపారు.

అనాథలకు ఆధార్ ఏదీ?

- ప్రభుత్వ గుర్తింపు లేక అవస్థలు
- వైద్యపరీక్షలకు ఇబ్బంది
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు



మానసిక దివ్యాంగులు

శివ్వంపేట(నర్సాపూర్): అనాథ ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వారు ప్రభుత్వ గుర్తింపు కార్డులు లేక వైద్య పరీక్షలకు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఆధార్, రేషన్‌కార్డుల కోసం నిర్వాహకులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా.. ఎవరూ కనికరించని పరిస్థితి నెలకొంది. మండల పరిధిలోని మగ్దుంపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో 2014 బేతానిసంరక్షణ నిలయం ఏర్పాటు చేశారు. దీంట్లో ప్రస్తుతం 52 మంది అనాథ మానసిక పిల్లలు ఆశ్రయం పొందుతున్నారు. రోడ్లపైన వదిలిపెట్టిన చిన్నారులను గుర్తించిన స్వచ్ఛంద సంస్థలు, పోలీసులు అనాథ ఆశ్రమంలో అప్పజెప్పారు. ఇందులో చాలా మంది మానసిక దివ్యాంగులు ఉన్నారు. తల్లిదండ్రులు తెలియని ఈ చిన్నారులకు నిర్వాహకులే అన్ని సేవలందిస్తున్నారు. మానసిక దివ్యాంగులకు వైద్య పరీక్షలు చేయిస్తున్నారు.

సంక్షేమ పథకాలు దూరం

అనాథ ఆశ్రమంలో 52 మంది ఉండగా అందులో చాలా మంది మానసిక దివ్యాంగులు ఉన్నారు. 18 సంవత్సరాల లోపు వారు 12 మంది ఉండగా, మిగతా 40 మంది 18 సంవత్సరాల పై బడిన వారు ఉన్నారు. ఇందులో 22 మందికి ఆధార్‌కార్డులు ఉన్నాయి. వీరికి ఎలాంటి గుర్తింపు కార్డులు లేకపోవడంతో ప్రభుత్వ నుంచి ఎలాంటి పథకాలు పొందడంలేదు. మానసిక దివ్యాంగుల అర్హత ఉన్నప్పటికీ ఆధార్ లేకపోవడంతో సదరన్ క్యాంపుకు హాజరయ్యే అవకాశం లేకుండా పోయింది. పలుమార్లు అధికారులకు ఈ విషయం విన్నపించినా పట్టించుకున్న దాఖలు లేవు. రేషన్‌కార్డు మంజూరు చేస్తే కనీసం నెలవారీగా వచ్చే బియ్యంతోనైనా విద్యార్థులకు కొంతమేర ఉపయోగపడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

క్యాంపు ఏర్పాటు చేయాలి

ఆశ్రమంలో మానసిక దివ్యాంగులు ఉన్నందున వారి కోసం ఆశ్రమ ప్రాంగణంలోని ఉన్నతాధికారులు క్యాంపు ఏర్పాటు చేసి ఆధార్, రేషన్‌కార్డులు మంజూరుతో పాటు అర్హత కలిగిన మానసిక దివ్యాంగులకు ధృవీకరణ పత్రాలు అందజేయాల్సిన అవసరం ఉంది.



బేతాని సంరక్షణ నిలయం

ఆధార్‌కార్డు ఇప్పించండి



అనాథలకు చేయూతను అందించాలని ఆశ్రమం ఏర్పాటు చేశాం. ఇందులో ఉన్న వారికి ఎలాంటి లోటు లేకుండా చూసుకుంటున్నాం. మెరుగైన విద్యాబోధన కోసం ఆశ్రమ ప్రాంగణంలోనే పాఠశాల ఏర్పాటు చేశాం. ఉన్నత అధికారులు స్పందించి అనాథ పిల్లలందరికీ ఆధార్‌కార్డు, రేషన్‌కార్డులు ఇప్పించాలి.

– ఆశ్రమ నిర్వాహకుడు సజీవ్‌వర్గీస్

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని దొంతి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 2000 – 2001లో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆదివారం మండలంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో కలిశారు. ఈ సందర్భంగా వారి గురువులను సన్మానించి అప్పటి పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.

దాడి చేయడం తగదు

నర్సాపూర్: మండలంలోని మహ్మదాబాద్ గ్రామానికి చెందిన మాదిగ పెంటయ్య, కృష్ణలను అదే గ్రామానికి చెందిన గౌడ కులస్తులు దాడి చేయడం తగదని సీపీఎం డివిజన్ కార్యదర్శి నాగరాజు అన్నారు. ఆదివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన దళితులు తమ అవసరాలకు వినియోగిస్తున్న భూమిలో పెరిగిన ముళ్ల పొదలు తొలగించేందుకు వెళ్లిన మాదిగ పెంటయ్య, కృష్ణలను అదే గ్రామానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్, చంద్రాగౌడ్, నర్సింహగౌడ్, సాయిగౌడ్‌లు అక్కడికి వచ్చిన వారిని బూతులు తిట్టి దాడి చేశారని చెప్పారు. ఈమేరకు మాదిగ పెంటయ్య, కృష్ణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. దళితులపై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట పలువురు దళిత సంఘాల నాయకులు, బాధితులు పెంటయ్య, కృష్ణ, సాయిలు, కుమార్, రవి, లింగం, గోపాల్, నర్సయ్య తదితరులు ఉన్నారు.

గో సంరక్షకుల అరెస్ట్ సరికాదు



మాట్లాడుతున్న విఠల్

పెద్దశంకరంపేట(మెదక్): మెదక్‌లో జరిగిన సంఘటనకు సంఘీభావం ప్రకటించిన గో సంరక్షుడు, జిల్లా బీజేపీ అధ్యక్షుడు శ్రీనివాస్ అరెస్ట్ సరికాదని బీజేపీ మండలాధ్యక్షుడు కోణం విఠల్ అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గోవ ద నిషేధమని, వాటిని సంరక్షించాలని హై కో ర్టు ఉత్తర్వులు ఇచ్చినా కొందరి నిర్లక్ష్యం మూ లంగా ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఈ విషయంపై ప్రభు త్వం వెంటనే చర్యలు చేపట్టి బాధ్యులపై కఠి న చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్ర మంలో బీజేపీ నాయకులు సూర్యప్రకాష్, అశోక్, శ్రావణ్, కృష్ణ పాల్గొన్నారు.

నేడు జిల్లా బంద్‌ను జయప్రదం చేయాలి

- బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రమణరావు

నర్సాపూర్: మెదక్ జిల్లా బంద్‌ను సోమవారం విజయవంతం చేయాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రమణరావు అన్నారు. సోమవారం జిల్లా బంద్‌కు పార్టీ జిల్లా కమిటీ పిలుపినిచ్చిందని చెప్పారు. కాగా నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలు బంద్ పాటించి విజయవంతం చేయాలని కోరారు. ఇటీవల మెదక్‌లో జరిగిన ఘటనను ఖండిస్తూ తమ పార్టీ బంద్ చేపట్టిందన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు బంద్ విజయవంతం చేయాలని కోరారు.

నార్సింగి మండల కేంద్రంలో..

చిన్నశంకరంపేట(మెదక్): మెదక్‌లో జరిగిన సంఘటనకు బీజేపీ శ్రేణులను అరెస్టులు చేసిన పోలీస్‌ల తీరుకు నిరసనగా మెదక్ జిల్లా బంద్‌కు పిలుపు ఇచ్చామని బీజేపీ నార్సింగి మండలాధ్యక్షుడు బాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం నార్సింగి మండల కేంద్రంలో నిర్వహించే బంద్‌కు వ్యాపార వాణిజ్య సంస్థలు సహకరించి బంద్‌కు మద్దతుగా నిలవాలని కోరారు.

రామాయంపేట(మెదక్): మెదక్‌లో బీజేపీ, వీహెచ్‌పీ కార్యకర్తలపై జరిగిన దాడికి నిరసనగా సోమవారం ఆ పార్టీ రామాయంపేట బంద్‌కు పిలుపునిచ్చింది.

శాంతియుతంగా పండుగను జరుపుకోవాలి

- ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి



ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి, నిజాంపేట

నిజాంపేట(మెదక్): హిందూ, ముస్లింలు పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా అతను మాట్లాడుతూ.. జరగబోయే పండుగల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పండుగలను జరుపుకోవాలన్నారు.

ప్రశాంత వాతావరణంలో బక్రీద్ జరుపుకోవాలి

కొల్చారం(నర్సాపూర్): మండలంలో ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగ జరుపుకోవాలని కొల్చారం ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ పేర్కొన్నారు. పండుగ రోజు ప్రభుత్వ ఆదేశాల మేరకు గోవధ నిషేధమని, గోవులను అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. పండుగ సందర్భంగా రెచ్చగొట్టే ప్రకటనలు ఎవరు చేసిన చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

రామాయంపేట సీఐగా వెంకట్ రాజాగౌడ్



రామాయంపేట (మెదక్): రామాయంపేట సీఐగా వెంకట్‌రాజాగౌడ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. సంగారెడ్డి ఏసీబీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనను రామాయంపేట బదిలీ చేశారు. ఇంతకుముందు ఇక్కడ పని చేసిన సీఐ వెంకటేశ్ ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని అధికారులు ఆదేశించారు.

తూప్రాన్‌లో రేపు మండల సమావేశం

తూప్రాన్: మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఆయా గ్రామాల ఎంపీటీసీలు, ప్రత్యేకాధికారులు, ఆయా శాఖల అధికారులు ఉదయం 11గంటలకు హాజరుకావాలని తెలిపారు. ఈ సమావేశంలో గ్రామాల్లో సమస్యలు చర్చించి పరిష్కరించనున్నట్లు తెలిపారు.

రేపు రేగోడ్‌లో..

రేగోడ్(మెదక్): మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 18న మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ సరోజన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సీతారావమ్మ ఆదివారం తెలిపారు.

20న మండల సర్వసభ్య సమావేశం

పెద్దశంకరంపేట(మెదక్): మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 20న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రఫీఖ్ ఉన్నీసా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ శ్రీనివాస్ అధ్యక్షతన చివరి మండల సర్వసభ్య సమావేశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పకుండా హాజరుకావాలని ఆమె కోరారు.

రోటరీ క్లబ్ సేవలకు అవార్డులు

ములుగు(గజ్వేల్): భద్రాచలంలో రోటరీ క్లబ్ అవార్డుల ప్రదాన కార్యక్రమం నిర్వహించినట్లు గజ్వేల్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు కుక్కల బాబుగౌడ్ తెలిపారు. 2023–24లో క్లబ్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. గజ్వేల్ రోటరీ క్లబ్‌కు 15 విభాగాల్లో అవార్డులు రావడం సంతోషంగా ఉందన్నారు. తనకు సహకరించిన క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు నరసింహారెడ్డి, చంటి, కరుణాకర్‌రెడ్డి, జగదీశ్వర్, సాయిరెడ్డి, నరేష్‌గౌడ్, మైపాల్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలి

శివ్వంపేట(నర్సాపూర్): భూ వివాదంలో శివ్వంపేట ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నాడని రైతులు పెంటారెడ్డి, సత్తిరెడ్డి, నర్సారెడ్డి ఆదివారం ఆరోపించారు. మండల పరిధిలోని పెద్దగొట్టిముక్ల గ్రామ పరిధిలోని పట్టా భూమికి సంబంధించి భూ వివాదంలో ఎస్‌ఐ జోక్యం చేసుకుని ఏకపక్షంగా వ్యవహరిస్తూ తమకు అన్యాయం చేస్తున్నాడని వాపోయారు. ఈ విషయం గురించి జిల్లా ఎస్పీ బాలస్వామితో పాటు తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రామిరెడ్డి, సీఐ కృష్ణలకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్ర మంలో రైతులు పెంటారెడ్డి, సత్తిరెడ్డి, నర్సారెడ్డి ఉన్నారు.

నల్లపోచమ్మకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



కౌడిపల్లి(నర్సాపూర్): నల్లపోచమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి



చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి ఆలయంలో భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్ల పోచమ్మదేవిని ఆదివారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయ ఈఓ రంగారావు ఆధ్వర్యంలో అర్చకులు శివప్ప, రాజేశ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారికి బోనాలు తీసి ఒడిబియ్యం సమర్పించారు. పలువురు భక్తులు వాహనాలకు పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, సిబ్బంది భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

చాముండేశ్వరి ఆలయంలో..

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారని ఆలయ అర్చకులు తెలిపారు. అనంతరం భక్తులు అమ్మవారికి ప్రదక్షిణలు చేసి, ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారని వారు తెలిపారు.

వ్యవసాయ పనులు ప్రారంభం

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఆయా గ్రామాల్లో రైతులు తమ వ్యవసాయ పనులను ముమ్మురం చేశారు. బోరుబావుల వద్ద తూకాలు పోయడంతో పాటు దుక్కులు దున్నే పనులు చేపడుతున్నారు. తమ పొలాల వద్ద ఆరుతడి పంటలైన పత్తి, పెసర, మినుము తదితర పంటలను రైతులు సాగు చేస్తున్నారు. దీంతో పంట పొలాల వద్ద రైతుల సందడి నెలకొంది.



రామోజిపల్లిలో దుక్కి దున్నుతున్న రైతు

గోవుల తరలింపు అడ్డగింత



చిన్నశంకరంపేటలో గోవులతో వెళ్తున్న ఆటోను అడ్డుకున్న బీజేపీ నాయకులు



చేగుంట(తూప్రాన్): గోశాలలో గోవులకు పండ్లను అందిస్తున్న ఆంజనేయులు

చిన్నశంకరంపేట(మెదక్): ట్రాలీ ఆటోలో తరలిస్తున్న గోవులను అడ్డుకొని పోలీస్‌లకు అప్పగించిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. మండల కేంద్రం నుంచి మెదక్ వైపు వెళ్తున్న టాటాఏస్ ట్రాలీ ఆటోలో రెండు గోవులను తరలిస్తుండగా గమనించిన బీజేపీ నాయకులు వాహనం అడ్డుకొని పోలీస్‌లకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీస్‌లు గోవులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గోవులను ఎక్కడికి తరలిస్తున్నారో విచారించనున్నట్లు పోలీస్‌లు తెలిపారు.

గోవులను కాపాడుకోవాలి

చేగుంట(తూప్రాన్): ప్రకృతి సమతుల్యత కోసం గోవులను కాపాడుకోవాలని దుబ్బాక నియోజకవర్గ బీజేపీ సోషల్‌మీడియా కన్వీనర్ ఆంజనేయులు అన్నారు. గోశాలలో ఆదివారం గోసేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోరక్షణతో ఎంతో ఉపయోగం ఉందని తెలిపారు. ఇటీవల కోర్టు సైతం గోవధ విషయంలో గోవులను రక్షించాలని తీర్పు ఇచ్చిందన్నారు. గోఅక్రమ రవాణాపై పోలీసులు నిఘా పెంచాలని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

వెల్దుర్తి(తూప్రాన్): ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని సీఎం వ్యక్తిగత కార్యదర్శి జైపాల్‌రెడ్డికి వినతిపత్రం అందించినట్లు సెంకడరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం తెలిపారు. ఎస్‌జీటీల సమస్యలు పదోన్నతుల్లో జరుగుతున్న అన్యాయం, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంల పోస్టులను వివరించినట్లు చెప్పారు.

పెండింగ్ దరఖాస్తుల పరిశీలన



పెండింగ్ దరఖాస్తులను పరిశీలిస్తున్న సిబ్బంది

శివ్వంపేట(నర్సాపూర్): పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్‌చారి అన్నారు. ఆదివారం సెలవురోజు అయినా.. రెవెన్యూ సిబ్బంది పెండింగ్ దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. మండలంలో 230 పెండింగ్ మొటేషన్, పౌతి, ఇతర రెవెన్యూ సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఆదివారం 50 పెండింగ్ సమస్యలు పరిష్కరించామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ షఫీయొద్దీన్, ఆర్‌ఐ కిషన్, సిబ్బంది ఉన్నారు.

రోడ్డుకు మోక్షమెప్పుడో?

చేగుంట(తూప్రాన్): దశాబ్ద కాలం క్రితం నిర్మించిన రోడ్డు శిథిలమై అధ్వానంగా మారింది. మండలంలోని రెడ్డిపల్లి కాలనీ నుంచి చేగుంట వరకు నిర్మించిన తారు రోడ్డు గతుకుల మయంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ దారిలో మార్కెట్ కమిటీ, సివిల్ సప్లయ్ గోదాం, ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాలిటెక్నిక్, మోడల్ స్కూల్, గిరిజన గురుకుల పాఠశాలలతో పాటు సీఎంఆర్ కాలనీ ఉంది. రెడ్డిపల్లికాలనీ మీదుగా వడియారం రైల్వే స్టేషన్‌కు రావడానికి దూరం తక్కువగా ఉండటంతో ఈ రహదారి గుండా చాలా వాహనాలు వెళ్తాయి. రెండేళ్ల క్రితం రోడ్డు శిథిలావస్థకు చేరుకోగా రాత్రి సమయాల్లో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో అధికారులకు స్థానికులు రోడ్డు బాగు చేయాలని వివరించినా పట్టించుకోవడం లేదు. అధికారులు, నాయకులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రెడ్డిపల్లికాలనీ - చేగుంట రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

ఎమ్మెల్సీపై అసత్య ఆరోపణలు తగవు

- బీఆర్‌ఎస్ నాయకులు

ములుగు(గజ్వేల్): మండలంలోని క్షీరసాగర్‌లో ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి అక్రమంగా భూములు ఆక్రమించారని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు చేసిన ఆరోపణల్లో నిజం లేదని బీఆర్‌ఎస్ నాయకులు మండిపడ్డారు. ఆరోపణలు నిజమని నిరూపిస్తే ఆ భూములను తామే పంపిణీ చేస్తామన్నారు. ఆదివారం పార్టీ మండల అధ్యక్షుడు జహంగీర్, మండల పీఏసీఎస్ చైర్మన్ అంజిరెడ్డి, రాష్ట్ర యువజన కార్యదర్శి జుబేర్‌పాష, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు కొన్యాల బాల్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి తారక సురేష్ తదితరులు విలేకరుల సమావేశంలో రఘునందన్‌రావు ఆరోపణలను ఖండించారు.